# ఛైర్మన్‌గా షిబ్లి నియామకంతో ఉర్దూ అకాడెమీకి మహర్దశ?

సంస్కృతి - సాహిత్యం



ముహమ్మద్ ఫారుఖ్ షిబ్లి
ఛైర్మన్, ఏపీ ఉర్దూ అకాడెమీ

ఉర్దూ భాషకూ, సాహిత్యానికీ, ఉర్దూ అకాడెమీకి మహర్దశను తీసుకురావడమే తన లక్ష్యమని ఏపీ రాష్ట్ర ఉర్దూ అకాడెమీ నూతన ఛైర్మన్ ఫారుఖ్ షిబ్లి పేర్కొన్నారు. ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన మరుక్షణం నుండే తన సహజశైలిలో కార్యాచరణకు దిగి, పలు ఉర్దూ చైతన్య కార్యక్రమాలకు రంగం సిద్ధం చేశారు. ఛైర్మన్‌గా షిబ్లి నియామకంపై ఉర్దూ భాషాభిమానులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఉర్దూ గ్రంథాలయాల సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉర్దూ సాహిత్య రంగంలో నూతన శకం ఆరంభమైందని పలువురు ఉర్దూ కవులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా సురూరె ఉర్దూ మహోత్సవ్ !

ఏపీ ఉర్దూ అకాడెమీ స్థాపించి 50 సం.లు పూర్తయిన సందర్భంగా.. సురూరె ఉర్దూ మహోత్సవ్ పేరుతో రాష్ట్ర మైనార్టీ శాఖామాత్యులు ఎన్ఎండీ ఫరూక్ నేతృత్వంలో ఉర్దూ అకాడెమీ ఛైర్మన్ ఫారుఖ్ షిబ్లి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ నగరం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అట్టహాసంగా నిర్వహించిన వేడుకల్లో మంత్రి





ఫరూక్‌తో పాటూ పలువురు ఎంపీలు, మైనారిటీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్, నాటక అకాడెమీ ఛైర్మెన్ గుమ్మడి గోపాలకృష్ణ, రాష్ట్రం నలుమూలల నుంచి ఉర్దూ కవులు, రచయితలు హాజరయ్యారు.

## విజయవాడ పుస్తక మహోత్సవంలో బుక్ స్టాల్!

కార్యక్రమాల్లో భాగంగా విజయవాడ పుస్తక మహోత్సవంలో ఏర్పాటుచేసిన ఉర్దూ అకాడమీ బుక్‌స్టాల్‌ను మంత్రి ఫరూక్ ఛైర్మెన్ ఫరూఖ్ షిబ్లీతో కలిసి





సందర్శించారు. ఉర్దూ అకాడమీ చరిత్రలో మొదటిసారి ఉర్దూ భాషాభివృద్ధి కోసం అకాడమీ చేపట్టిన కార్యక్రమాలను తెలుసుకుని షిబ్లీని మంత్రి అభినందించారు. అలాగే ఉర్దూ అకాడమీ స్టాల్‌ను రాష్ట్ర మైనారిటీ ప్రభుత్వ సలహాదారులు అహ్మద్ షరీఫ్ సందర్శించి, అక్కడి పుస్తక ప్రదర్శనను తిలకించి ఛైర్మన్ షిబ్లీని అభినందించారు. ఆయనతో పాటు వక్ఫ్‌బోర్డు సభ్యులు బేపారీ జాకిర్ అహ్మద్ హాజరయ్యారు. అంతేకాకుండా ఉర్దూ బుక్‌స్టాల్‌ను పలువురు ప్రముఖులు సందర్శించి వివిధ రచనలను పరిశీలించారు.

## కడపలో ఉర్దూ మహోత్సవ్ ర్యాలీ!

స్వాతంత్ర్య సమరయోధులు, ఉర్దూ కవులైన రామ్‌ప్రసాద్ బిస్మిల్, అష్ఫాఖుల్లా ఖాన్‌ల బలిదాన దినోత్సవం సందర్భంగా కడపలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే ఆర్.మాధవి పాల్గొన్నారు.



ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ ఉర్దూ అకాడమీ ఛైర్మన్ ఫారూక్ షబ్లీ మాట్లాడుతూ, ఉర్దూ కేవలం ఒక భాష మాత్రమే కాదు, భారత సమ్మిళిత సంస్కృతికి జీవించి ఉన్న చిహ్నమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఉర్దూ కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉర్దూ భాష, సంస్కృతి అభివృద్ధికి అందించిన చారిత్రక సేవలను ఫారూక్ షబ్లీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ముఖ్యంగా 1996లో ఉర్దూకు రెండో అధికార భాష హోదా కల్పించడం, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీకి భూమి కేటాయింపు, కర్నూలులో డా.అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ స్థాపన, 350కి పైగా షాదీఖానాలు, ఉర్దూ ఘర్లు, ప్రత్యేక ఉర్దూ డీఎస్సీ ద్వారా ఉర్దూ ఉపాధ్యాయుల నియామకం మొదలగునవి వివరించారు.

## ఉర్దూ లైబ్రరీల తనిఖీలు!



రాష్ట్రవ్యాప్తంగా ఉర్దూ అకాడెమీ పరిధిలో నడుస్తున్న ఉర్దూ లైబ్రరీలు, కంప్యూటర్ సెంటర్ల తనిఖీలను షిబ్లి ప్రారంభించారు. అలాగే సౌకర్యాలతో కూడిన ఉర్దూ అకాడెమీ నూతన కార్యాలయాన్ని మంగళగిరిలో సిద్ధం చేస్తున్నారు.

## ఉర్దూ భాషా వికాసానికి ఊపు - సత్తార్ ఫైజీ



ఏపీ ఉర్దూ అకాడమీ ఛైర్మన్‌గా షారూఖ్ షిబ్లిని నియమించడం శుభపరిణామమని రాయలసీమ ఉర్దూ రచయితల సమైఖ్య ప్రధాన కార్యదర్శి సత్తార్ ఫైజీ హర్షం వ్యక్తం చేశారు. షిబ్లి సారధ్యంలో ఉర్దూ భాష, విద్య, సాహిత్య, సాంస్కృతిక రంగాల వికాసానికి ఊపు లభిస్తుందని అన్నారు. అకాడెమీ తరపున ఉర్దూ సాహిత్యాన్ని విరివిగా ప్రచురించాలని కోరారు.